క్లుప్తంగా

సుందరీకరణ పనులు ప్రారంభం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని సుందరీకరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మై విలేజ్ మై కంట్రీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మన్నె రాజవర్ధన్‌రెడ్డి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఉన్న చెట్లు, స్తంభాలకు సున్నం, జాజు వేసే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, నాగేందర్‌సాగర్, ఓంప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు



కొత్తకోట రూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు తనిఖీ ముమ్మరం చేస్తున్నారు. గురువారం మండలంలోని పామాపురంలో శ్రీనివాసులు అనే వ్యక్తి కిరాణం షాపులో మద్యం విక్రయిస్తున్నాడని తెలుసుకున్న కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తన సిబ్బందిని పామాపురం పంపించి దాడులు చేశారు. ఈ తనిఖీలో సుమారు రూ.8,500 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

రూ.25,300 మద్యం సీజ్




ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలోని బెల్టుషాపులపై గురువారం పోలీసులు దాడి చేసి సుమారు 36 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని షాపు యజమానులపై కేసు నమోదు చేశారు. సోళీపురంలోని శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి అక్రమంగా అనుమతులు లేకుండా మద్యం నిల్వ చేశారనే సమాచారంతో ఎస్ఐ శ్రీహరి సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో మొత్తం రూ.25,300 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ తెలిపారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన చెప్పారు.

గడపగడపకు కాంగ్రెస్ 6 గ్యారెంటీలు



మదనాపురం: మండలం కేంద్రంలో గురువారం గడపగడపకు కాంగ్రెస్ ప్రవేశపెట్టనున్న ఆరు సంక్షేమ పథకాలపై మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మహాలక్ష్మి ద్వారా మహిళలకు ప్రతి నెల రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా నుంచి ప్రతి ఏటా కౌలు రైతులకు రూ.15 వేలు వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అందిస్తారన్నారు. ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇంటి పథకం కింద రూ.5లక్షలు, యువ వికాసంలో విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డు, చేయూత పెంఛన్ రూ.4 వేలు అమలు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రాజు, రాఘవులు, వెంకటేష్ రజినీకాంత్,రాధాకృష్ణ, శ్రీనివాసులు ఉన్నారు.

బతుకమ్మ సంబురాలు



ఆత్మకూర్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా పట్టణంలోని వాసవీమాత ఆలయంలో గురువారం రాత్రి ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సతీమణి పద్మ బతుకమ్మ పూజలకు హాజరయ్యారు.కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మినాగేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెబ్బేరు రూరల్: రామ్మమపేట నుంచి పెబ్బేరుకు అనుమతి లేకుండా ఊకచెట్టు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శాఖాపూర్‌కు చెందిన డ్రైవర్ జక్కుల శంకర్, ట్రాక్టర్ ఓనరు దేవేందర్ కలిసి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా రామమ్మపేట ఆంజనేయ ఆలయం వద్ద పట్టుకున్నామని తెలిపారు.



సంగినేనిపల్లిలో..



అమరచింతలో..



మదనాపురంలో..

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

ఆత్మకూర్: దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని పార్వతిదేవిగా అలంకరించారు. దుర్గాహోమం, సహస్ర కుంకుమార్చన, వాసవీమాత పల్లకీసేవ, బతుకమ్మ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మీదేవిగా, వాల్మీకినగర్‌లో మహాచండిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, రవి దంపతులు, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ మండ్లరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ కేంద్రంలోని 8వ వార్డులో ప్రతిష్ఠించిన దుర్గామాత పూజలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు కౌన్సిలర్ చీర్లనాగన్న సాగర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, విశ్వేశ్వర్, బీచుపల్లి రాములు యాదవ్, శ్రీనివాస్‌జీ, కృష్ణయ్యగౌడ్ ఉన్నారు.

దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..

కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో గల జ్ఞానాంబికాదేవి ఐదో రోజు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితాత్రిపురసుందరిదేవిగా, భవాని మాత ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అమరచింత: పట్టణంలోని వివిధ వార్డుల్లో భవానీ మాత విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. కాళికామాత ఆలయంలో, విష్ణేశ్వర భవాని నగర్‌లో అమ్మవారు లలితాసుందరిదేవీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి కన్యాకపరమేశ్వరీ ఆలయంలో గురువారం లలితాదేవిగా అమ్మవారు దర్శనమివ్వడంతో రకరకాల గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమ ఆర్చనలు, చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో వీరన్నశెట్టి, రాంబాబు శెట్టి, నవీన్‌శెట్టి, శ్రీనివాసులుశెట్టి, మురళిశెట్టి, మాణిక్యంశెట్టి, చంద్రమౌళాలి పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు తూముకుంట, కల్వరాల తదితర గ్రామాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వేళలో దుర్గామాత విగ్రహాల వద్ద భజన పోటీలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అమ్మవారి పూజలకు రూ.20వేల విరాళం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీదుర్గామాత ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త వంగూరి ప్రమోద్‌రెడ్డి రూ.20 వేల విరాళం పంపారు. జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొడుగు సత్యం, కాగితాల మధు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఏదుల ఎర్రగట్టు దేవస్థాన సన్నిధిలో ఐదో రోజు లలిత త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజలో గువ్వల ఉస్సేన్, భాగ్యమ్మ, చెన్నారం కురుమయ్య, చంద్రకళ, బద్దుల మహేష్, కుసుమ కొమ్ము మల్లయ్య, పార్వతమ్మ, గాంధీనగర్ మహేష్ పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలో లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మదనాపురం, దుప్పల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు.



కొత్తకోటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



ఖిల్లాఘనపురంలో విరాళం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కేతేపల్లిలో అమ్మవారికి చక్రస్నానం చేయిస్తున్న భక్తులు



ఏదులలో..



కానాయపల్లి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..



ఆత్మకూర్‌లో..

ప్రార్థన మందిరాల వద్ద సారా అమ్మితే చర్యలు



దర్గా ఆవరణంలో యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్

సాక్షి ఎఫెక్ట్..

అమరచింత: ప్రార్థన మందిరాలు, ఆలయాల సమీప ప్రదేశాల్లో సారా విక్రయాలు జరిపినా, మద్యం సేవించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేశ్ అన్నారు. 'ప్రార్థన మందిరాల వద్ద సారా అమ్మకాలు' అన్న శీర్షికన బుధవారం సాక్షిలో వెలువడిన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. రాజావళీ దర్గా ఆవరణంలో గురువారం సారా సేవించడం ద్వారా కలిగే అనర్థాలతో పాటు విక్రయదారులకు సహకరించొద్దంటూ అక్కడ ఉన్న యువకులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళి ప్రకారంగా అక్రమంగా మద్యం విక్రయించిన నేరమన్నారు. దర్గా పరిసరాల ప్రాంతంలో సారా తాగటం, వాటి ఖాళీ పాకెట్లను అక్కడే పారవేయడం వంటి ఘటనలు మరోమారు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొల్లాపూర్(పెంట్లవెల్లి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా పతాంజలి యోగా అధ్యక్షుడు అర్జున్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని కొండూరులో యోగా శిక్షణను ఆయన ప్రారంభించాడు. గ్రామంలో విద్యార్థులు, యువకులు, వృద్ధులు, పెద్దలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం యోగా చేస్తే మానసికంగా ధృడంగా ఉంటామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కూడా దూరం అవుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు, యువతకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



పోలింగ్ కేంద్రాల్లో వసతులు తప్పనిసరి

పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంపు తదితర వసతులు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని, రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, గోడలపై రాతలు లేకుండా చూసుకోవాలన్నారు. ఉపాధి పనులకు ప్రతి గ్రామంలో 50 మంది కూలీలు తగ్గకుండా పనికి వచ్చేలా చూడాలని, నూతన నర్సరీల్లో మొక్కల కోసం మట్టిని సిద్ధం ఉంచుకోవాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

28 పోలింగ్ బూతుల ఏర్పాటు..

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధి 28 పోలింగ్ బూతులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. అందులో 21,567 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 11,018 మంది పురుషులు, 10,549 మహిళా ఓటర్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బొల్లారంలో రెండు పోలింగ్ బూతులు, కొర్లకుంటలో ఒకటి, వల్లాభాపూర్ ఒకటి, కల్వరాలలో 4, పుల్గర్‌చర్ల 2, గోపల్‌దిన్నె 2, రంగవరం ఒకటి, సంపత్‌రావుపల్లి ఒకటి, తూముకుంట 3, నాగర్లబండతండా ఒకటి, సంగినేనిపల్లి 3, గోవర్ధనగిరి 2, వీపనగండ్లలో 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ బూతుల వారీగా ఓటర్ జాబితా బీఎల్‌ఓల వద్ద సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

అధికారుల పర్యవేక్షణ లేకుండానే సీసీ పనులు

అమరచింత: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న వేళ అధికారుల పర్యవేక్షణ లేకుండానే గ్రామంలో సీసీ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో సుమారు రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసి గత నెలలో పనుల కోసం భూమిపూజ నిర్వహించారు. దీంతో మూడు రోజుల కిందట గ్రామంలో సర్పంచ్ రాజేశ్వరమ్మ నేతృత్వంలో సీసీ రహదారి పనులను ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ చేపడుతున్నారు. పంచాయతీ రాజ్ ఏఈ నరేష్ సమక్షంలో జరగాల్సిన పనులు కేవలం గుత్తేదారు సమక్షంలో జరుగుతున్నాయి. సంబంధిత పంచాయతీ రాజ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు లేకుండా నాణ్యతకు విరుద్ధంగా పనులు నిర్వహించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నాగల్‌కడ్మూర్‌లో కొనసాగుతున్న సీసీ రహదారి పనులు

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



అమడబాకులలో ప్రచారం చేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: బీఆర్ఎస్ పాలనలో ప్రతి పల్లె ఎంతో అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలంటూ జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని అమడబాకులలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజవర్గంలో ఏ సమస్య వచ్చినా నేనున్నాంటూ ముందుకు వచ్చే వ్యక్తి ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఉంచుతూ రాష్ట్రంలోనే దేవరకద్రకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ఆలకే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు అడిగేవారిని నమ్మవద్దన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం వనపర్తి ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్ కుమార్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరు కలసి కట్టుగా పనిచేస్తూ మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచు వినీలారాణి, సత్యనారాయణయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, పృథ్వీరాజు, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గోవిందహళ్లిలో..

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం..

పెబ్బేరు రూరల్: పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి వాసంతి ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచ్‌లు వినీలారాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, అక్కల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని గోవిందహళ్లిలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తు మీద ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, కృష్ణ యాదవ్, బండలయ్య యాదవ్, నరేందర్‌రెడ్డి, మల్లేష్, గట్టు, శివ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గోపాల్‌పేట: వనపర్తి జిల్లాలో పనిచేస్తున్న ప్రైవేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం ఎదుట మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో పనిచేస్తున్న కార్మికులు చేయించుకోవాలంటే మహబూబ్ నగర్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో వనపర్తిలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉండేదని, కానీ ప్రస్తుతం ఈ సేవలను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్, ఇతర కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఉన్నా కూడా ఉపయోగపడటం లేదన్నారు. వెంటనే స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. హమాలీలు, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు, ఆటోలు, డీసీఎంలు, లారీ ఇతర వాహనాలు నడిపే వారికి షాప్ వర్కర్స్ ఇతర కార్మికులకు అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఆశావర్కర్లకు, అంగన్‌వాడీలకు సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి ఆంజనేయులు

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డాక్టర్ మురళీధర్‌రావు

కొత్తకోట: దసరా పండగ సందర్భంగా 'ఆరోగ్య క్రికెట్ క్లబ్' ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో గురువారం హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గంభీర్ టీం ప్రథమ విజేతగా, సచిన్ టీం ద్వితీయ విజేతగా నిలిచాయి. విజేతలకు బహుమతులను ప్రజావైద్యశాల డాక్టర్ మురళీధర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను స్నేహపూర్వక వాతావరణంలో ఆడాలన్నారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్‌గౌడ్, సినారె అవార్డు గ్రహిత బైరోజ్ చంద్రశేఖర్, ఆరోగ్య క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తితో మెలగాలి..

చిన్నంబావి: యువత క్రీడా స్ఫూర్తితో మెలగాలని విద్యా సంస్థల చైర్మన్ ధారసింగ్ అన్నారు. మండలంలోని బెక్కెంలో ఏర్పాటు చేసిన బీపీఎల్ క్రికెట్ పోటీలను ప్రారరంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలకు విరాళాలు అందించిన పలువురుని ఆర్గనైజర్స్ సన్మానించారు. కార్యక్రమంలో గోవిందు శ్రీధర్‌రెడ్డి, కర్నాకర్‌రెడ్డి, రాజురెడ్డి, జయగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎస్ఆర్ఐ కళ్యాణ్‌రావు, కృష్ణాప్రసాద్‌యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, చిదంబర్‌రెడ్డి, సర్పంచ్ రంజిత్‌కుమార్, తేజారెడ్డి పాల్గొన్నారు.



బెక్కెంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ధారాసింగ్

వెల్టూరు గుందిమళ్ల బ్యారేజీని పూర్తి చేయాలి

చిన్నంబావి: దక్షిణ తెలంగాణకు సాగునీటి వరప్రదాయినిగా నిలిచే వెల్టూరు గుందిమల్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని రాష్ట్రంలోని అన్ని పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని వెల్టూరుగుందిమల్ల సాధన సమితి నాయకులు పెద్దమల్లయ్య, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల నుంచి కృష్ణానదిపై అలంపూర్, కొల్లాపూర్ నియోజకవర్గాలను కలుపుతూ బ్యారేజీ నిర్మించి జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని పోరాడుతున్న ఒక్క పార్టీ కూడా దీనిపై స్పందించకపోవడం బాధాకరం అన్నారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జోగులాంబ బ్యారేజీ పేరుతో ప్రాజెక్ట్ నిర్మిస్తామని హామీ ఇచ్చి ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా కృష్ణా, గోదావరి నదులపై నూతన ప్రాజెక్టలను నిలవరిస్తూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ఎత్తివేయాలని కోరారు. రానున్న వారం రోజుల్లో వెల్టూరు నుంచి కొల్లాపూర్ ఆర్‌డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మధుసూదన్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

నవంబర్ 2న దేవేంద్రాచార్య ఆరాధనోత్సవాలు

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో వెలసిన దేవేంద్రాచార్య మహాస్వాముల 71వ దివ్య ఆరాధనా మహోత్సవాలు నవంబర్ 2 నుంచి ప్రారంభమవుతున్నాయని మఠ నిర్వాహకుడు నరసింహాచారి తెలిపారు. దేవేంద్రాచార్య మహాస్వాముల ఆరాధన ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం సర్పంచ్ రాజేశ్వరమ్మతో పాటు గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు స్వామివారి ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు భక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. దేవేంద్రాచార్య మఠానికి చుట్టు గ్రామాల ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని తెలిపారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న భక్తులు